క్లుప్తంగా

ఎన్నికల నిబంధనలు పాటించాలి

అనపర్తి: ఎన్నికల కమిషన్ షెడ్యూలు విడుదల చేసిన నేపథ్యంలో ఎన్నికల నిబంధనలను ప్రతిఒక్కరూ తప్పకుండా పాటించాలని అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్, తహసీల్దార్ డి.సునీల్‌బాబు సూచించారు. సాధారణ ఎన్నికలకు సంబంధించి నియోజకవర్గ పరిధిలో ఫిర్యాదుల స్వీకరణకు గాను అనపర్తి రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికలకు సంబంధించి ఏ విధమైన ఫిర్యాదులున్నా కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబరు 90323 48356కు తెలియజేయాలని సూచించారు.

20న విశ్వేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం


అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి

రంగంపేట: మండలంలోని వడిశలేరులో కొలువైన అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం ఈనెల 20న నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ సత్తి సత్తిబాబు తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బుధవారం ఉదయం 6 గంటల నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం కల్యాణం నిర్వహిస్తామన్నారు. భక్తులంతా స్వామిని దర్శించి కల్యాణ వేడుకలను తిలకించాలని కోరారు.

పలు గ్రామాల్లో సీఐఎస్ఎఫ్ కవాతు


కవాతు నిర్వహిస్తున్న సీఐఎస్ఎఫ్

సీతానగరం: మండలంలోని పలు గ్రామాల్లో సెంట్రల్ ఇండస్ట్రీయల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) కవాతు నిర్వహించింది. ఆదివారం కోరుకొండ సీఐ అడపా నాగమురళి, ఎస్సై టి.రామకృష్ణల ఆధ్వర్యంలో 67 మంది సీఐఎస్ఎఫ్ జవాన్లు కవాతు నిర్వహించారు. పురుషోత్తపట్నం, రామచంద్రపురం, వంగలపూడి, సింగవరం, సీతానగరంలలో కవాతు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ నాగమురళీ హెచ్చరించారు. ప్రజలకు అవగాహన కల్పించడానికి ఈ కవాతు నిర్వహించామన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవాలు


శ్రీరంగపట్నంలో వీరబ్రహ్మేంద్రస్వామి రథానికి పూజలు చేస్తున్న విజయలక్ష్మి

మధురపూడి: కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో ఆదివారం శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవాలు ఘనంగా జరిగాయి. వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి పాల్గొని, స్వామిని దర్శించుకున్నారు. అనంతరం నూతనంగా తయారుచేసిన స్వామి వారి రథాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవిష్యత్తు కాలాన్ని గురించి ముందే ప్రజలకు వివరించిన కాలజ్ఞాని అన్నారు. వీరబ్రహేంద్రస్వామి మహాతత్వవేత్తని కొనియాడారు. 100 సంవత్సరాలుగా స్వామివారి ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా స్వామి వారు రథంపై గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించండి

రాజానగరం: సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా కోడ్ అమలులోకి వచ్చినందున ప్రతి ఒక్కరూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలని రాజానగరం ఈఆర్వో, రాజమహేంద్రవరం ఆర్డీఓ ఎ.చైత్రవర్షిణి అన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఆదివారం సమావేశమై ఎన్నికల సమయంలో ఎవరు ఏవిధంగా వ్యవహరించాలో వివరిస్తూ, ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అవగాహన కలిగించారు. పబ్లిక్ ప్లేస్‌లో ఉన్న రాజకీయ పార్టీలకు సంబంధించిన బోర్డులు, పోస్టర్లు, ప్లెక్సీలు, బోర్డింగ్‌లను వెంటనే తొలగించాలని వీఆర్వోలకు సూచించారు. ఎన్నికలకు సంబంధించి ఏవిధమైన ఫిర్యాదులున్నా 0883-2971950 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. 93464 79234 వాట్సాప్ నంబర్‌కు కూడా ఫిర్యాదు చేయవచ్చన్నారు. పంచాయతీ కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తహసీల్దారు మస్తాన్ పాల్గొన్నారు.

శనగ తీత పనుల్లో బిజీబిజీ

- ముమ్మరంగా శనగతీత పనులు
- ఆశాజనకంగా దిగుబడి
- ప్రభుత్వ మద్దతు ధర రూ.5.440
- ఆర్‌బీకేల ద్వారా కొనుగోళ్లకు సిద్ధం


పొలాల్లోనే యంత్రాల ద్వారా శనగ నూర్పిడి చేస్తున్న రైతులు


పండిన శనగ పంటను తీస్తున్న మహిళా కూలీలు


యంత్రాల ద్వారా నూర్పిడి చేసిన శనగలు

రంగంపేట: మెట్ట ప్రాంతమైన రంగంపేట మండలంలో ప్రస్తుతం శనగ పంట ఒబ్బిడి పనులు ముమ్మరంగా సాగుతున్నారు. ఆ పనుల్లో రైతులు బిజీబిజీగా ఉన్నారు. ఖరీఫ్‌లో వేసిన పంటలు పెద్దగా దిగుబడి లేకపోవడంతో రైతులు అరకొర లాభాలతో గట్టెక్కారు. అనంతరం రబీలో ప్రభుత్వం రాయితీపై వివిధ దశల్లో సుమారు 155 టన్నుల శనగ విత్తనాలు పంపిణీ చేయడంతో రంగంపేట, వడిశలేరు, పెదరాయవరం, చంద్రేడు తదితర గ్రామాల రైతులతో పాటు మండల వ్యాప్తంగా సుమారు 1550 ఎకరాల్లో రైతులు శనగ పంటను సాగు చేశారు. సాధారణగా ఈ పంటకు రెండు, మూడు తడుల నీరు ఉంటే సరిపోతుంది. ఎక్కువగా మంచుతోనే పెరుగుతుంది.

చిగురిస్తున్న ఆశలు

మండలంలో నల్లరేగడి నేలల్లో ఎక్కువగా ఉండడంతో రైతులు పత్తి పంటను సాగు చేసేవారు. అయితే గులాబి రంగు పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్న కారణంగా పత్తి పంటకు కొన్నేళ్లు విరామం ఇవ్వాలని వ్యవసాయాధికారులు సూచించడంతో ప్రత్యామ్నయంగా రైతులు శనగ పంటను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం శనగ పంట చేతికందుతోంది. పంట దిగుబడి కూడా ఆశాజనకంగా ఉండడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఎకరాకి 8 నుంచి 12 బస్తాల దిగుబడి వస్తుందని రైతులంటున్నారు.

మండల వ్యాప్తంగా శనగ పంట తీత, నూర్పిడి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. పంటను కూలీల ద్వారా తీయించి పోగులు పెడుతున్నారు. ఈ పోగుల వద్దకు నూర్పిడి యంత్రాలను తీసుకువచ్చి అక్కడి కక్కడే నూర్పిడి చేసి పంటను బస్తాల్లో ఒబ్బిడి చేస్తున్నారు.

ప్రభుత్వం పంటకు మంచి మద్దతు ధర చెల్లిస్తుంది. క్వింటా రూ.5440 ధర ప్రకటించింది. పండించిన శనగ పంటను ఒబ్బిడి చేసి ఇంటికి తీసుకువచ్చి నిల్వ చేసుకోవడానికి స్థలం లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతుండడంతో ప్రభుత్వం స్థానిక రైతుభరోసా కేంద్రాల్లోనే శనగలు కొనేందుకు ఏర్పాట్లు చేసింది. ఇక ఏ గ్రామంలో రైతులు ఆ గ్రామంలోనే శనగలు అమ్ముకోవచ్చు. దీనికి రైతులు ముందుగా ఆర్‌బీకేల్లో తమ ఆధార్ కార్డు నకలు అందించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ఇప్పుడు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముమ్మరంగా జరుగుతుంది. మార్చి 15వ తేదీ తరువాత శనగల కొనుగోలు ప్రారంభించనున్నట్టు అధికారులు తెలిపారు. కొందరు రైతులు పెట్టుబడికి తెచ్చిన అప్పులు తీర్చడానికి, కూలీలు, యంత్రాలకు చెల్లించడానికి అంతేకాకుండా బయట మార్కెట్‌లో క్వింటా రూ.5వేల నుంచి రూ. 6,500 వరకు ధర వస్తుండడంతో దళారులకు అమ్ముకుంటున్నారు.

వాతావరణం అనుకూలించడంతో..



"ఈ సీజన్‌లో రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా రాయితీపై శనగ విత్తనాలు అందించడంతో మెట్టప్రాంత రైతులందరూ పంట సాగు చేశారు. వాతావరణం అనుకూలించడంతో పంట దిగుబడి పెరిగింది. ఎకరానికి పది నుంచి పన్నెండు క్వింటాలు దిగుబడి వచ్చే అవకాశం ఉంది."

కంటిపూడి సత్యనారాయణ, రైతు, చంద్రేడు

కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పరదేశమ్మ

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- నర్సాపురంలో అమ్మవారి జాతర ఉత్సవాలు


నర్సాపురంలో పరదేశమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే రాజా

మధురపూడి: కోరుకొండ మండలం నర్సాపురంలోని పరదేశమ్మ కోరిన కోర్కెలను తీర్చే దేవతని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ఆదివారం నర్సాపురంలోని పరదేశమ్మ వారి ఉత్సవాలు జరిగాయి. వీటికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ అమ్మవారి ఉత్సవాలను నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీని అభినందించారు. తొలుత అమ్మవారిని దర్శించుకున్న ఆయన స్థానికులతో కొద్దిసేపు మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ కడియాల పాపారావు, వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు చొంగా శివయ్య, కోరుకొండ పీఏసీఎస్ చైర్‌పర్సన్ మారిశెట్టి తేజో నాయుడు పాల్గొన్నారు.

హాల్ టికెట్ చూపిస్తే ఆర్టీసీలో ఉచిత ప్రయాణం

సీతానగరం: తమ పదవ తరగతి పరీక్ష హాల్ టిక్కెట్ చూపిస్తే ఆర్టీసీ బస్‌లో విద్యార్థులు ఉచితంగా ప్రయాణించవచ్చని ఎంఈఓ కె.స్వామినాయక్ తెలిపారు. ఆదివారంవిలేకరులతో మాట్లాడుతూ మండలంలో నాలుగు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. సీతానగరం ప్రభుత్వ హైస్కూల్ సెంటర్‌లో 120 మంది హాజరవుతారని తెలిపారు. చిన కొండేపూడి సూర్యచంద్ర ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో 220మంది, రఘుదేవపురం జిల్లా పరిషత్ హైస్కూల్లో 240 మంది, వెదుళ్లపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో 250 మంది పదవ తరగతి పరీక్షలకు హాజరు అవుతారని తెలిపారు. మొత్తం 830 మంది పదవ తరగతి విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని ఎంఈఓ స్వామినాయక్ తెలిపారు.

ప్రజాసేవే లక్ష్యం

- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా
- కోరుకొండలో గడప గడపకూ వైఎస్సార్ సీపీ సందడి


కోరుకొండ ఫిల్మ్‌నగర్‌లో గడప గడపకూ మన వైఎస్సార్ సీపీ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజా

మధురపూడి: ప్రజలకు సేవలందించడమే లక్ష్యంగా రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్టు, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా స్థానికులను కోరారు. ఆదివారం మండల కేంద్రమైన కోరుకొండలో గడప గడపకూ మన వైఎస్సార్ సీపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు ఫిల్మ్‌నగర్‌లో ప్రారంభమైన కార్యక్రమం రాత్రి 8 గంటల వరకూ సాగింది. సాయంత్రం నుంచి రాత్రి వరకూ 550 గడపల కెళ్లి ప్రతీ ఒక్కర్నీ పలకరిస్తూ సంక్షేమ పథకాలందుతున్న తీరుపై ఆరా తీశారు. తొలుత పార్టీ జెండా ఆవిష్కరణ చేసిన తర్వాత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అవినీతికి తావులేకుండా అర్హతగల ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. సంక్షేమ పథకాలందించడం ద్వారా ప్రజలకు ఆర్థిక భరోసా ఏర్పడిందన్నారు. జగనన్న పట్ల ప్రజలు మంచి ఆదరాభిమానాన్ని చూపుతున్నారని, రాష్ట్రంలో 175 నియోజకవర్గాలను కైవసం చేసుకోవాలనే లక్ష్యంతో ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు. ఇదే స్ఫూర్తిని పార్టీ నాయకులు, శ్రేణులకు అందించడం జరిగిందన్నారు. రాజానగరం నియోజకవర్గంలో ఐదు సంవత్సరాల కాలంలో 1,158 కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించినట్టు తెలిపారు. 22 వేలమంది నిరుపేదలకు ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేసినట్టు తెలిపారు. నియోజకవర్గంలో ప్రజలు తన పట్ల చూపుతున్న అభిమానాన్ని చూస్తుంటే 45 వేల మెజార్టీతో విజయకేతనాన్ని ఎగురవేస్తాననే నమ్మకం కలుగుతోందన్నారు. కార్యక్రమంలో పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు పసుపులేటి బుల్లియ్యనాయుడు, పార్టీ మండల కో-కన్వీనర్ గణేశుల పోసయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు కేతినేడి అశోక్, ఎంపీటీసీ సభ్యుడు కాళ్ల వీరబాబు, ఎంపీటీసీ కో-ఆప్షన్ సభ్యుడు గొల్లపల్లి ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా కోదండ రామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ


పూజా కార్యక్రమంలో పాల్గొన్న పలువురు దంపతులు

సీతానగరం: మండలంలోని చినకొండేపూడిలో కోదండరామచంద్రస్వామి, పరివార దేవతా విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. ఆదివారం చినకొండేపూడిలో కోదండరామచంద్రస్వామి ఆలయ పునఃనిర్మాణం చేసిన అనంతరం సరిపల్లి శంకరంరాజు పర్యవేక్షణలో పిఠాపురానికి చెందిన బ్రహ్మశ్రీ పూడిపెద్ది నరసింహశర్మ, వింజమూరి సత్యనారాయణమూర్తిల ఆచార్య బ్రహ్మత్వంలో పదకొండు మంది పండితులతో నిర్వహించిన పూజా కార్యక్రమంలో దంతులూరి విక్రమరాజు (రవి), సరస్వతి దంపతులు, పేరిచర్ల ధర్మతేజరాజు (రాంబాబు), జయ దంపతులు, ముదుంటి సోమరాజ్, దీప్తి రాజ్ దంపతులు, పేరిచర్ల ప్రమోద్ వర్మ, సుధ దంపతులు, పేరిచర్ల వినోద్ వర్మ, సింధు దంపతులు, దంతులూరి అవినాష్ రాజు, శిరి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఫాల్గుణ శుద్ధ అష్టమి, మృగశిర నక్షత్రయుక్త వృషభలగ్నములో ఉదయం 10.22 గంటలకు మహాగణపతి, మహాలక్ష్మీ సహిత శ్రీసీతారాచంద్ర, లక్ష్మణ, ఆంజనేయ, ధ్వజ, శిఖర, వాహన సమూర్తుల విగ్రహాలు ఏకకాలంలో యంత్ర స్థాపన, విగ్రహ స్థాపన, ప్రాణ ప్రతిష్ఠాపన వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు.

సీఎం జగన్‌తోనే అన్ని వర్గాల సంక్షేమం

ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి


రామేశ్వరంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సతీమణి ఆదిలక్ష్మి

పెదపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అన్ని వర్గాల సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సతీమణి ఆదిలక్ష్మి అన్నారు. రామేశ్వరంలో ఆదివారం ఆమె ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిలక్ష్మికి మహిళలు పెద్ద ఎత్తున హారతులిచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీమణి ఆదిలక్ష్మి మాట్లాడుతూ ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందించడమే జగన్ లక్ష్యమన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి తన భర్త సత్తి సూర్యనారాయణరెడ్డి శక్తి వంచన లేకుండా కృషి చేశారన్నారు. ముఖ్యమంత్రి జగన్ ఐదేళ్ల పాలన స్వర్ణయుగంగా సాగిందన్నారు. ప్రజలందరూ సంక్షేమం, అభివృద్ధిని చూసి వచ్చే ఎన్నికల్లో సీఎంగా జగనన్నను, ఎమ్మెల్యేగా సూర్యనారాయణరెడ్డిని, ఎంపీగా గూడూరి శ్రీనివాస్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, పార్టీ జిల్లా యువజన విభాగం కార్యదర్శి కొటికలపూడి గణేష్, గొల్లపల్లి దుర్గా ప్రసాద్, కొటికలపూడి రమణ, కోలా లోవ, గొల్లపల్లి జగన్నాథం, వాసపల్లి శివ గంగ, రాపర్తి, రామకృష్ణ, కొటికలపూడి శ్రీనివాస్, నున్న రాజేంద్ర, నక్క శివ తదితరులు పాల్గొన్నారు.

యోగాభాగ్యాలు


యోగాలో సత్తా చాటిన సాత్వికను అభినందిస్తున్న కలెక్టర్ మాధవీలత


ట్విస్టింగ్ ఆసనం

- రాష్ట్ర స్థాయి పోటీల్లో మూడుసార్లు విజేత
- జాతీయ స్థాయిలోనూ రాణిస్తున్న సాత్విక

ప్రకాశం నగర్: కేవలం ఐదేళ్ల ప్రాయంలోనే యోగా సాధనలో అడుగు పెట్టిన సాత్విక మూడుసార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రథమ స్థానం కైవసం చేసుకుని గోల్డ్‌మెడల్ సాధించింది. నగరానికి చెందిన సాత్విక ప్రస్తుతం ఒక ప్రయివేట్ పాఠశాలలో ఆరవ తరగతి చదువుతోంది. తల్లిదండ్రులు అరుణ, దామోదర్‌ల ప్రోత్సాహంతో చదువుతోపాటు యోగాలో శిక్షణ తీసుకుంటున్న చిన్నారి యోగాలో కోచ్ శ్రీనివాస్ పర్యవేక్షణలో పలు కఠినమైన ఆసనాలను అవలీలగా వేసి అందరినీ ఆకట్టుకుంటోంది. 12 ఏళ్ల ప్రాయంలోనే యోగాలో ఇంతటి ప్రతిభ చూపిన సాత్వికను కలెక్టర్ కె.మాధవీలత అభినందించారు. చెన్నైలో జరిగిన ఖేలో ఇండియా యూత్ గేమ్‌లో ప్రధాని నరేంద్రమోదీ ముందు పూర్ణశలభాసనాన్ని 180 సెకండ్ల పాటు వేసి ఆయన ప్రశంసలు అందుకుంది.


బ్యాక్ బెండ్ ఆసనం

మరింత శిక్షణ ఇస్తాం

"రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో మూడుసార్లు విజేతగా నిలిచిన సాత్విక, జాతీయ స్థాయి పోటీల్లో విజయం సాధించేందుకు అవసరమైన శిక్షణ ఇస్తాం. అండర్ -8 నుంచి ,అండర్ -17 విభాగాల్లో సుమారు 15 మంది చిన్నారులకు యోగాలో శిక్షణ ఇస్తున్నాను."

\- శ్రీనివాస్, యోగా శిక్షకుడు

వీటితోపాటు 200 మంది యోగా క్రీడాకారులతో గిన్నిస్ వరల్డ్ రికార్డు మాస్ ఈవెంట్‌లోను అలరించింది.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

2022లో స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా పోటీల్లో, నేషనల్ యోగసనా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా పోటీల్లో ప్రథమ స్థానం, 2023లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో వరుసగా మూడుసార్లు ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలు సాధించింది. మహారాష్ట్ర, పంజాబ్, తమిళనాడులో జరిగన జాతీయ స్థాయిలో పోటీల్లో పాల్గొని తన సత్తాను చాటింది. భారత్ స్కౌట్‌లో విద్యార్థినిగా ఉన్న సాత్విక ఇటీవల రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో అమృత్ స్టేషన్ పథకంలో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక పోటీల్లో పలు యోగసనాలు వేసి అందరి ప్రశంసలు అందుకుంది. ముఖ్యంగా యోగసనాలలో బ్యాక్ బెండ్, ట్విస్టింగ్ వంటి ఆసనాలతో చూపరులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి ..


వైఎస్సార్ సీపీలోకి స్వాగతం పలుకుతున్న జక్కంపూడి విజయలక్ష్మి

రాజానగరం: మండలంలోని సీతారామపురానికి చెందిన టీడీపీ నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేసి ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. గ్రామ సర్పంచ్ బొబ్బర వరహాలు, నాయకులు అడబాల చినబాబు, పలివెల గోవిందరాజుల ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ పలివెల వీరబాబు, టీడీపీ సీనియర్ నాయకులు పలివెల లక్ష్మన్న, అమరపల్లి అప్పారావు, సేనాపతి వెంకయ్యమ్మ, వాకచర్ల మాణిక్యాలరావు, వాకచర్ల విష్ణు, వాకచర్ల రాంబాబు తదితరులకు వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి పార్టీ కండువాలతో స్వాగతం పలికారు. గడచిన ఐదేళ్లలో జగనన్న ప్రభుత్వంలో అందుకున్న సంక్షేమాలను, పొందిన ప్రగతిని దృష్టిలో పెట్టుకుని రాబోయే ఎన్నికలలో ఓటు చేయాలన్నారు. రాష్ట్రంలో ఇతర నియోజకవర్గాల కంటే రాజానగరం నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో అభివృద్ధి జరిగిందన్నారు. రాష్ట్ర ప్రగతి, ప్రజా సంక్షేమం కొనసాగే విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మరొకసారి పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో తుమ్మల గంగరాజు, మేడిశెట్టి కాపు, సత్తి గణేష్, ఆరిపాక నాగబాబు, దాసరి దొరబాబు, గెడ్డం ప్రకాష్, సేనాపతి గణేష్, కొత్తపల్లి గణేష్, బంతికోటి ముత్యాలు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్

సీతానగరం: మండలంలోని సింగవరం నాగరత్నం కాలనీలో సోమవారం నుంచి ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్ నిర్వహిస్తామని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్, తెలుగు అధ్యాపకురాలు ఎం.సుధామయి తెలిపారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపు ఈ నెల 24 వరకు ఏడు రోజుల పాటు సింగవరం పంచాయతీ పరిధిలోగల నాగరత్నం కాలనీలో నిర్వహిస్తామన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్ఎస్ఎస్ క్యాంపు నిర్వహిస్తామని ఎన్ఎస్ఎస్ పీవో సుధామయి తెలిపారు.

శ్రీరాముని స్మారక వెండి నాణెం కొనుగోలు


శ్రీరాముని స్మారక వెండి నాణెం కొనుగోలు చేసిన హారిక

సీటీఆర్ఐ: రామ జన్మభూమి మందిర నిర్మాణ సందర్భంగా, కోల్‌కతాలోని భారత ప్రభుత్వ మింట్ 50 గ్రాముల స్మారక వెండి నాణేన్ని ముద్రించింది. దీని విలువ 5,300 రూపాయలు. నాణేనికి ఒకవైపు రాముని ప్రతిమ, రెండో వైపు అయోధ్య రామ మందిరం ముద్రించారు. తూర్పుగోదావరి జిల్లాలో తొలిసారిగా ఈ స్మారక వెండి నాణాన్ని వరదా హారిక అందుకున్నారు. స్మారక వెండి నాణెం జిల్లాలో తొలిసారిగా తాను అందుకోవడం ఆనందంగా ఉందని తన సంతోషాన్ని వెల్లబుచ్చారు.

యుద్ధాలమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం

బిక్కవోలు: మండలంలోని కొంకుదురులో చింతల కాలువ గట్టున పొలాల మధ్య వెలసిన యుద్ధాలమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన కర్రి శివశేషారెడ్డి, కర్రి వెంకటరెడ్డి, వెలగల అశోక్ రెడ్డి, సత్తి గణేష్‌రెడ్డి దంపతులు చండీ హోమం నిర్వహించారు. దాతల సహకారంతో భక్తులకు అన్న సమారాధన జరిపారు.